# పిల్లి-పులి

శీనాదేవి




కలియుగే, ప్రథమపాదే, జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే, అస్మిన్ వర్తమానేన వ్యావహారిక చాంద్రమానేన .. సంవత్సరాణాం.

నాలుగు వేదాలూ నమిలేసిన ఆ అగ్రహారం ఒక కొండవార పీఠలో ఉంది. అక్కడ అన్ని కులాలవాళ్ళూ తమ కుల వృత్తులు చేసుకుంటూ, ధర్మాన్ని పెంపొందిస్తూ, అధర్మాన్ని అసహ్యించుకుంటూ, చల్లగా, హాయిగా జీవిస్తున్నారు. ఏడాదికి మూడు కుంచాలవర్షం. పదహారణాం పంటా వారికి మామూలు ఐపోయేయి, కలికాలం అయినా వారు ధర్మాన్ని పిలక పట్టుకొని నాలుగు కాళ్ళమీదా నడిపిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా ఆ ఊరు ఒకస్వామి వచ్చేరు. వారు వేదాల్నీ, వేదాంగాల్నీ ఏనాడో నమిలేసేరు. సకల శాస్త్రాలనీ పిండి తాగేసేరు. వారు చూపులకి బంగారం పిసికి చేసినట్టు ఉంటారు. ఇన్ని ఉన్నా, వారికి 'నాది' అని చెప్పుకోడానికి కౌపీనం మినహా ఇంకేమీలేదు.

వేదవేదాంగాలు చదివినవారికికూడా ఆకలివేస్తుంది. స్వామి పాలు మినహా ఇంకేమీ పుచ్చుకోరు. అంచేత ఒకవైశ్య శిఖామణి వారికి దూడతోసహా ఒక ఆవుని దానంచేశాడు.

ఆవు నల్లగా ఉంటుంది. దూడకూడా నల్లగానే ఉంటుంది. ఆవుకి ఎక్కడా మచ్చలేదు. దూడకి కూడాలేదు. దూడ నెమ్మదైంది. ఆవు యింకా నెమ్మదైంది. దాన్ని ఎంచేతో 'కామధేనువు' అని పిలవకుండా 'గంగిగోవు' అని పిలిచే వారు ప్రజ. అది ఏ పొలంలో మేసినా ఎవరూ అడ్డుపెట్టరు. అయినా అది తన పేరు సార్థకం చేసుకోవడానికే అన్నట్టు ఎవరి పొలంలోనూ మేయక. 'దొంగ పాలు' యజమానికి యివ్వడం యిష్టం లేక. అది కొండవార పచ్చికలో మేసేది. కొండదిగువ ఏట్లో నీళ్ళుతాగేది. గడ్డి. నీళ్ళూ కలిసి చిక్కటి పాలు యిచ్చేది.

మంచికాలం యిలా కొంత గడిచేక ఆవేళ మధ్యాహ్నం ఝామున్నరైంది.

గంగిగోవు మేస్తున్న నీటిలోపచ్చిక భూమ్మీద పరుచుకున్న మేఘంలా ఉంది. దానిమీద పడిన కొండనీడ - నీటి నీడలా - చల్లగా ఉంది. దూరంనుండి చూస్తే పచ్చికలో మేస్తున్న గంగిగోవు - వెన్నకంపెనీ ఎడ్వర్‌టైజ్‌మెంట్ బొమ్మ ఆవులా అందంగా. ఆరోగ్యంగా ఉంది.

అంతలో గంగిగోవు తలెత్తి చూసింది. కొండనీడ చింతతోపు చివరకి వచ్చేసింది. అంటే "అమ్మ బాబోయ్! ఆశ్రమానికి వెళ్ళిపోవలసిన కాలం వచ్చేసిందన్నమాట. గంగిగోవుకి యింకా ఆకలి తీరలేదు. అయినా అది దొంగ గొడ్డు కాదుకాబట్టి ఇంటికి వెళ్ళడానికి వాగువేపు పరిగెత్తింది.

వాగు నీటిలో కొండరంగు కరిగినట్టు నీరు నీలిగా ఉంది. కొండమీది ఓషధుల సారం అంతా గ్రహించినట్టు ఆ నీరు చాలా చల్లగానూ. ఉత్తేజకరంగానూఉంది.

గంగిగోవు నాలుగు గుక్కలు నీరు తాగిందోలేదో. దానికి వాగు గట్టుమీదినుండి ఒక భయంకరమైన అరుపు వినిపించింది. ఆ అరుపుకి నీరు గడ్డకట్టి పోయింది. అప్పుడు గంగిగోవు చూలుతో ఉండి వుంటే దాని కడుపులో పిల్లచచ్చిపోయేది.



గంగిగోవు తలఎత్తేసరికి దానికి దగ్గర్లోనే ఒక నల్లరాతిమీద ఒకవింతజంతువు నిలబడిఉంది. అది రాజుగార్లా దర్జాగా ఉండటమే కాకుండా. అప్పుడే నిద్రలేచిన రాజుగారిలా బద్ధకంగా కూడా ఉంది.

గంగిగోవు అమాయకంగా ఆజంతువు వేపు చూసింది.

"నేను పులిని" అంది ఆ జంతువు.

"మిమ్మల్నికలుసుకున్న నేను అదృష్టవంతురాల్ని" అంది ఆవు.

"నాకాకలేస్తోంది" అందిపులి.

"పాలిచ్చేదా?" అంది అమాయకంగా ఆవు.

"మేం పులిపాలు తప్ప తాగం" అధికారంగా ప్రకటించింది పులి.

"ఇక్కడ గడ్డి చాలా రుచిగా వుంటుంది."

"గడ్డి గోవులు తింటాయి" విరసనగా నవ్వింది పులి.

"మరిమీరు....

"గోవుల్ని తింటాం. మీకూ. మాకూ పరస్పర విరోధం. కావలిస్తే పంచాంగం చూసుకో".

ఆవుకి మాటరాలేదు. పులినిచూస్తే అది అబద్ధమాడేరకంలాలేదు.

"నామాట అబద్ధమేమో చూడు. నిన్ను మెల్లిగా పంజాతో ఒక దెబ్బ కొడతాను. ఆ తర్వాత పూర్తిదెబ్బ తట్టుకోగలవేమోచూడు" అని అరసెకండు ఆగకుండా గంగిగోవు తలమీద పావుబలంతో ఒక దెబ్బకొట్టింది పులి.

ఆవుకి యినపరాయితో తలమీద ఏవరో రాక్షసుడు కొట్టినట్టు అయింది. తల పగిలిపోయినట్టు రక్తం చిమ్మింది. కళ్ళల్లో రక్తంపడి ఎదురుగా ఉన్నపులి రక్తంలో స్నానంచేసిన దానిలా భయంకరంగా కనిపించింది.

"నువ్వు నల్లదానివి. అంటే మంచిదానివి. తెలివైనదానివి అన్నమాట. నేను నిన్ను అరక్షణంలో చంపగలనని యీ పాటికి గ్రహించే వుంటావు. ఇంతమంచిదానివి నిన్ను ఎక్కువ బాధపెట్టి చంపదలుచుకోలేదు. నువ్వు పెనుగులాడకుండా ఉంటే మూణ్ణిముషాల్లో పనిపూర్తిచేస్తాను" అందిపులి పనిలోకి దిగడానికి సిద్ధపడుతూ.

ఆవు పవిత్రమైన ఆశ్రమ వాతావరణంలో పెరిగింది చావుఅంటే యీ ఐహిక బంధాలనుండి ఆత్మవిముక్తి పొందడం అని ఏనాడో గ్రహించిన దవడంవల్ల. పులి అన్నమాటకు బెదరలేదు. కాని దానిమనసు ఒక్కసారి ముడిపడినట్టు బాధపడింది తనపిల్లని తల్చుకోగానే.

అంతేత "ఓ పులి పుంగవా! నేను గోవుని. అంటే జీవరాసుల్లో పవిత్రమైన దాన్ని. నీ ఆకలి తీర్చేఅవకాశం ఇచ్చిన నీకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోవాలో తెలియడంలేదు. నువ్వుకొట్టిన చావుదెబ్బతో బతకడం చావుకన్న దుర్భరంగా ఉంది. కాని ఒక్కమనవి. ఇప్పుడు నీ అంత ఆకలితోనూ నాబిడ్డ ఆశ్రమంలో కిరకిరలాడుతూ ఉంటుంది. కాబట్టి నాకు వ్యవధియిస్తే దాని ఆకలి తీర్చి క్షణంలో వచ్చేస్తా. అప్పుడు నువ్వు కొమ్ముల్తో సహా తినెయ్యి" అంది.

పులి ఆలోచిస్తూ కళ్ళుమూసుకుంది.

"నీకు దూకవుందని నేను నమ్మను" అంది కళ్ళుతెరవకుండా.

"నాయీచేసిన పొరుగుచూడు" తనన్నమాట నిజమన్న నమ్మకంతో అంది గంగిగోవు.

"చేటపెయ్యలకి చేపే జాతిపిది" అంది ఎగతాళిగా పులి.

ఆవు అంతరాత్మ, ఆత్మాభిమానం దెబ్బతిన్నాయి. "నా దూడని నాతోకూడా తెస్తే అది బతికేఉందని నమ్ముతావా?" అంది ఆవు రోషంగా నోట్లోకి కారిన రక్తాన్ని తక్కుతూ.

"అలా అయితే నమ్ముతా. కానివేగం వచ్చెయ్"అనుమతించిందిపులి.

* * *

తర్వాత హంకాలు చకచకా జరిగిపోయేయి.

బాధతోనూ. ఆతృతతోనూ గంగిగోవు ఆశ్రమానికి పరిగెత్తింది. తన దూడకి ఆఖరిసారి తనివితీరా పాలుఇచ్చుకొంది. పాలిస్తున్నప్పుడు దాని రక్తం దూడమీద కూడా పడింది.

ఆ తర్వాత గంగిగోవు పిల్లతోసహా హాజరైంది పులిదగ్గర

"నీ నిజాయితీకి నేను మెచ్చేను" అని పులిదాన్ని అభినందించింది.

తర్వాత - ముందుదూడనీ. తర్వాత ఆవునీ తినేసింది. *


